నేడు కలెక్టరేట్‌లో స్పందన



పుట్టపర్తి, జనవరి 21: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు అధికారులందరూ హాజరుకావాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.





అంతా రామమయం. ఏనోట విన్నా.. ఏ నలుగురు కలిసినా అయోధ్య చర్చే. అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లాలో సైతం సందడి కనిపిస్తోంది. ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పెనుకొండలోని ఆలయాలన్నీ సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. అతిపురాతనమైన రామభద్ర ఆలయాన్ని విద్యుద్దీపాలు, మామిడి తోరణాలు, జెండాలు, శ్రీరామనామం ముద్రించిన తోరణాలతో అలంకరించారు. సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం రామభద్రాలయంతోపాటు కాశీవిశ్వేశ్వరుడు, లక్ష్మీ వెంకటరమణస్వామి, ఊరువాకిలి ఆంజనేయస్వామి, వజ్రముష్టి ఆంజనేయస్వామి, మిట్ట ఆంజనేయస్వామి, బోగసముద్రం చెరువులోని శివుని విగ్రహాల వద్ద విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. రాత్రికి ఆలయాలన్నింటిలో దీపారాధన కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. - పెనుకొండ

ఇదేనా.. సామాజిక న్యాయం?

ధర్మవరం మార్కెట్‌యార్డు చైర్మన్ సీటు ఖాళీ

- నాలుగున్నరేళ్లుగా నియమించని దుస్థితి
- ఎస్సీ మహిళకు రిజర్వేషన్
- ఎంపికకు ప్రజాప్రతినిధి విముఖత?

'బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అది చేశాం.. ఇది చేశాం' అంటూ వైసీపీ ప్రజాప్రతినిధులు ఊదరగొడుతుంటారు. ధర్మవరంలో ఇటీవలే సామాజిక సాధికార బస్సుయాత్ర కూడా నిర్వహించారు. సామాజిక న్యాయం మాత్రం చేయరన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ పరంగా వచ్చిన పదవుల్లో కూడా నియమించకుండా నిలువునా అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వ్యక్తమవుతున్నాయి. ధర్మవరం మార్కెట్ యార్డు చైర్మన్ సీటు నాలుగున్నరేళ్లుగా ఖాళీగానే ఉంది. చైర్మన్ రిజర్వేషన్ ఎస్సీ మహిళకు వచ్చింది. ఆ మేరకు ఎస్సీ మహిళకు అవకాశం కల్పించకుండా అధికార పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధి నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. ధర్మవరంలో అసలు సామాజిక సాధికారత ఉందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. - ధర్మవరంరూరల్



ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డు

నాలుగున్నరేళ్లుగా..

జిల్లాలోనే ధర్మవరం మార్కెట్‌యార్డుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ రైతాంగం ఎక్కువగా వేరుశనగ, కంది, వరి, కూరగాయలు, ఉద్యాన పంటలు సాగుచేస్తారు. దిగుబడులను మార్కెట్‌కు తీసుకొచ్చి, గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవచ్చు. మార్కెట్‌లోనే వ్యాపారులకు అమ్ముకున్నా.. ప్రభుత్వం కొనుగోలు చేసినా రైతులకు అంతో.. ఇంతో మేలు చేకూరుతుంది. మార్కెట్‌కు చైర్మన్ ఉండుంటే గ్రామాల్లో రైతులతో సత్సంబంధాలు ఏర్పరచుకుని మార్కెట్ ఆదాయానికి దోహదపడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డుకు చైర్మన్ నియామకంపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధర్మవరం మార్కెట్ యార్డుకు చైర్మన్‌ను నియమించలేదు. టీడీపీ హయాంలో బీసీ సామాజికవర్గానికి చెందిన కమతం కాటమయ్యను చైర్మన్‌గా నియమించారు. వైసీపీ పాలనలో ఎవ్వరినీ ఎంపిక చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్కెట్‌యార్డులకు చైర్మెన్ నామినేట్ చేయాలని ఉత్వర్తులు వచ్చినా.. అవి ఇక్కడ అమలుకాలేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తొలుత విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఓసీ మహిళకు అవకాశం ఇచ్చింది. అప్పుడు నియమించలేదు. మళ్లీ ఎస్సీ మహిళకు రిజర్వేషన్ వచ్చింది. అయినా పట్టించుకోలేదని సొంతపార్టీవాళ్లే గుసగుసలాడుతున్నారు. ప్రజాప్రతినిధి మార్కెట్‌యార్డు చైర్మన్ నియామకం పట్ల సుముఖంగా లేరనీ, ప్రభుత్వ ఉత్తర్వులను సైతం పక్కన పెట్టారని పలువురు పేర్కొంటున్నారు. గతేడాది ఆగస్టులో మార్కెట్‌యార్డులకు చైర్మన్‌లను నియమించుకోవాలని ఉత్తర్వులు వచ్చాయి. జిల్లాలో అన్ని మార్కెట్‌యార్డులకు ఆయా ప్రజాప్రతినిధులు చైర్మన్ పేరును ప్రతిపాదించి, నియమించారు. ధర్మవరంలో మాత్రం ఇంతవరకు నియమించలేదు. సొంతపార్టీలోని ఆశావహులకు నిరాశే మిగిలింది. చైర్మన్ పదవీకాలం ఏడాది ఉంటుంది. ఆ తర్వాత ఆరునెలలకోసారి మరో ఏడాది వరకు పొడిగించుకోవచ్చు. ఒక్కో మార్కెట్‌యార్డుకు చైర్మన్‌తో పాటు వైస్‌చైర్మన్, 13 మంది డైరెక్టర్లను ఎంపికచేయాల్సి ఉంటుంది. చైర్మన్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రొటోకాల్ వర్తిస్తుంది. అలాంటి చైర్మన్ నియామకంలో ప్రజాప్రతినిధి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం పట్ల సొంతపార్టీ నేతల నుంచే అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఆదాయ లక్ష్యం రూ.56 లక్షలు



ధర్మవరం మార్కెట్‌యార్డు పరిధిలోకి ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాలు వస్తాయి. బత్తలపల్లి, రాళ్లఅనంతపురం చెక్‌పోస్టులు ఉన్నాయి. చెక్‌పోస్టులు, మార్కెట్‌లోని గోదాముల బాడుగలు తదితరాల ద్వారా మార్కెట్‌కు ఏడాదికి రూ.56లక్షల ఆదాయాన్ని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పంటల ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్‌కు కూడా సరైన బాడుగలు రాక సిబ్బందికి జీతాలు ఇవ్వలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తోంది.

ధర్మవరం, గోరంట్ల మినహా..

జిల్లాలో కదిరి, తనకల్లు, నల్లమాడ, మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో మార్కెట్‌యార్డు చైర్మెన్‌ను ఎంపికచేసి, ప్రస్తుతం వారి పదవీకాలం ముగిసి, కొత్తవారిని కూడా ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ధర్మవరం, గోరంట్ల మార్కెట్ యార్డులకు మాత్రం చైర్మన్ ఎంపికలో ప్రజాప్రతినిధులు సుముఖత చూపకపోవడంతో ఖాళీగానే ఉన్నట్లు సమాచారం.

ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలోని అన్ని మార్కెట్‌యార్డు చైర్మన్ల ఎంపికపై ఆయా యార్డు సెక్రటరీల ద్వారా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. ధర్మవరం, గోరంట్ల తప్ప.. అన్ని మార్కెట్‌యార్డులకు చైర్మన్ ఎంపిక పూర్తి చేశాం. ధర్మవరం యార్డుకు ఎస్సీ మహిళ రిజర్వేషన్ వచ్చింది. నాలుగేళ్లుగా చైర్మన్‌ను ఎంపిక చేయలేదు. రైతులకు ఇబ్బందులు లేకుండా మార్కెట్‌లో పంట ఉత్పత్తులు, దిగుబడులు నిల్వ ఉంచుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నాం.

- నరసింహమూర్తి,
జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి

నాట్‌వర్క్..!



సచివాలయం పైకెక్కి నెట్‌వర్క్ కోసం సిబ్బంది తంటాలు

సచివాలయం పైకెక్కినా.. నెట్‌వర్క్ రాలే..

కులగణనకు సాంకేతిక సమస్యలు

కులగణన సర్వేను సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. నెట్‌వర్క్ రాక సచివాలయ సిబ్బంది పడుతున్న పాట్లు అన్నీ.. ఇన్నీ కావు. ఎత్తైన ప్రదేశాలకు వెళ్తున్నారు. భవనాలు, గుట్టలు ఎక్కాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. అందుకు నిదర్శనమే ఈ ఫొటో. నంబులపూలకుంట మండలం మేకలచెరువు పంచాయతీ పరిధిలో ఎక్కడా నెట్‌వర్క్ రావట్లేదు. దీంతో చేసేదిలేక సచివాలయ సిబ్బంది, వలంటీర్లు.. ప్రజలను తీసుకుని సచివాలయ భవనం ఎక్కుతున్నారు. అక్కడ గంటల తరబడి పడిగాపులు కాస్తూ.. నెట్‌వర్క్ కోసం తంటాలు పడుతున్నారు. ఆదివారం ఉదయం 11.00 గంటల సమయంలో వారు సచివాలయ భవనం పైకెక్కారు. వచ్చిన కొంతమంది వివరాల సేకరణకు మూడున్నర గంటలపాటు ఎండలోనే పడిగాపులు కాశారు. అతికష్టమ్మీద వారి సర్వే పూర్తి చేశారు. పంచాయతీ పరిధిలో నెట్‌వర్క్ కోసం రోజూ ఇలా భవనాలు ఎక్కాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు. -నంబులపూలకుంట

టీడీపీతోనే బీసీలకు రాజకీయ గుర్తింపు

జయహో బీసీ సదస్సులో మాజీ మంత్రి పల్లె



బీసీ నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న పల్లె

కొత్తచెరువు, జనవరి 21: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతోనే బీసీలకు రాజకీయ గుర్తింపు లభించిందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీవిద్య ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జయహో బీసీ సదస్సును పల్లె ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు మండలంలోని నారేపల్లిలోని రామాలయంలో పూజలు నిర్వహించి, బైక్ ర్యాలీ ప్రారంభించారు. మైలసముద్రం, కేశాపురం, కొడపగానిపల్లి, మైలేపల్లి, లింగారెడ్డిపల్లి మీదుగా ర్యాలీ కొత్తచెరువుకు చేరుకుంది. నాలుగురోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అక్కడి నుంచి నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి, తలమర్ల, మరకుంటపల్లి, పోతులకుంట, అప్పలవాండ్లపల్లి, బైరాపురం క్రాస్, లోచర్ల మీదుగా తిరిగి కొత్తచెరువుకు చేరుకుంది. అనంతరం శ్రీవిద్య ఫంక్షన్ హాల్‌లో జయహో బీసీ సదస్సును మండల కన్వీనర్ అడపాల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ.. బీసీలకు సముచిత స్థానం తెలుగుదేశం పార్టీతోనేనే సాధ్యమన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఉండగా.. సైకో జగన్‌రెడ్డి దానిని 24 శాతానికి తగ్గించారన్నారు. వైసీపీ పాలనలో అధికారాలన్నీ నలుగురు రెడ్ల చేతుల్లోనే ఉన్నాయన్నారు. రైతులకు సమాధానం చెప్పలేక వారిని మభ్యపెట్టేందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, తాను ఎమ్మెల్యే, మంత్రి కావడం, నియోజకవర్గంలోని 193 చెరువులకు నీరు నింపడం ఖాయమన్నారు. టీడీపీకి ఓట్లు వేసి, చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, నాయకులు మాణిక్యంబాబా, బండ్లపల్లి రాజు, బీడుపల్లి సుబ్బరాయుడు, ఒలిపి శీనా, వీవీ శివప్రసాద్, రామాంజనేయులు, పాండురంగప్ప, అంజినప్ప, పత్తి చంద్రశేఖర్, సామకోటి ఆదినారాయణ, కేశప్ప, చంద్రాయుడు, నల్లమాడ శంకర్, సుబ్బాచారి, మోహనాచారి, శీనా, అబ్దుల్లా పాల్గొన్నారు.

వ్యాయామం.. జీవితంలో భాగం కావాలి

అల్ట్రా మారథాన్ ప్రారంభంలో ఎస్పీ అన్బురాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 21: వ్యాయామం ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని ఎస్పీ అన్బురాజన్ సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక సేవతోపాటు శారీరక శ్రమ ఎంతో ముఖ్యమన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్ట్రా మారథాన్‌ను ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఎస్పీ అన్బురాజన్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. పూలే సర్కిల్, సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు, టవర్‌క్లాక్, కోర్టురోడ్డు, హౌసింగ్‌బోర్డు మీదుగా అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియం వరకు 10కే రన్, 5కే వాక్ సాగింది. ఆర్డీటీ స్టేడియంలో కమ్యూనిటీ రన్ నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజికసేవకు పునరంకితం కావాలని, అప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందని వివరించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఆర్డీటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, అల్ట్రా రన్నర్ జువాన్ మాన్యువల్ పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్నవారు

మత్తులో డిజిటల్ లావాదేవీలు



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మాయ..!

- ఎనిమిది నెలల క్రితం కొత్త విధానం అమలు
- డిజిటల్ యంత్రాలున్నా పనిచేయని వైనం
- మరికొన్ని చోట్ల అరకొరగా పేమెంట్లు
- మందుబాబులకు తప్పని చిల్లర కష్టాలు
- కొరవడిన ఎక్సైజ్ యంత్రాంగం పర్యవేక్షణ

మద్యం దుకాణంలో డిజిటల్ యంత్రం

"ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే దశల వారిగా మద్య పాన నిషేధం అమలు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే దాన్ని తుంగలో తొక్కారు. మద్యపాన నిషేధం అమలు చేయకపోవడాన్ని అటుంచితే... ప్రభుత్వమే మద్యం దుకాణాల నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు."

అనంతపురం అర్బన్

అరకొరగా డిజిటల్ లావాదేవీలు

జిల్లాలోని అనంతపురం నగరంలోని కొన్ని దుకాణాలతో పాటు పలు పట్టణాలు, హైవే సమీపంలోని దుకాణాల్లో మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నట్లు సమాచారం. మరికొన్ని దుకాణాల్లో అరకొరగా నగదు రహిత లావాదేవీలు చేస్తున్నట్లు తెలిసింది. యంత్రాలు సరిగా పనిచేయకపోవడం, యంత్రాలకు సిబ్బంది చార్జింగ్ సరిగా పెట్టకపోవడం, నెట్‌వర్క్ సమస్యలతో డిజిటల్ లావాదేవీలు జరగడం లేదు.

చిల్లర కష్టాలు

అనంత ఉమ్మడి జిల్లాలో 192 ప్రభుత్వం మద్యం దుకాణాలున్నాయి. ఇందులో అనంతపురం జిల్లాలో 127, సత్యసాయిలో 65 ఉన్నాయి. అలాగే ఏడు మాల్స్ నడుస్తున్నాయి. మరోవైపు బార్ అండ్ రెస్టారెంట్లు అనంతపురంలో 18, సత్యసాయిలో 10 ఉన్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లల్లో మొదటి నుంచి డిజిటల్ లావాదేవీలే జరుగుతున్నాయి. ప్రభుత్వం మద్యం దుకాణాల్లో ఆలస్యంగా గత ఏడాది ఏప్రిల్ నుంచి డిజిటల్ పద్ధతిని అమలు చేసింది. ఉమ్మడి జిల్లాలో సగానికి పైగా మద్యం షాపుల్లో డిజిటల్ లావాదేవీలు జరగడం లేదు. ఆయా ప్రాంతాల్లోని మద్యం దుకాణాల్లో డిజిటల్ యంత్రాలు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనమూ లేదని తెలిసింది. ఫోన్ పే, గుగూల్ పే ద్వారా డబ్బులు వేస్తామని మందుబాబులు అడిగినా మిషన్ పని చేయడం లేదని సిబ్బంది చెబుతున్నట్లు తెలిసింది. చిల్లర డబ్బులు మిగిలించుకోవడానికి దుకాణంలోని సిబ్బంది కావాలనే ఇలా చేస్తోందని మందుబాబులు వాపోతున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఉందని మండిపడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలు అమలు చేయడంపై నిర్లక్ష్యం జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిసింది. ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణా లోపమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదంతా చూస్తుంటే ప్రభుత్వం నామమాత్రంగానే ఈ యంత్రాలు పెట్టిందని స్పష్టమవుతోంది. ఇప్పటికైనా ఆ శాఖ యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని మద్యం దుకాణాల్లో తప్పనిసరిగా డిజిటల్ పద్ధతిలో లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



డిజిటల్ యంత్రాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

తగిన చర్యలు

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ పద్ధతిలో లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. గత ఏడాది ఏప్రిల్ నుంచే కొత్త పద్ధతిని ప్రభుత్వం అమలు చేసింది. అన్ని దుకాణాలకు యంత్రాలు సరఫరా చేశాం. ఎక్కడైనా డిజిటల్ పద్ధతిలో ఫోన్ పే, గుగూల్ పే ద్వారా డబ్బులు తీసుకోకపోతే తక్షణమే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

- రామమోహన్‌రెడ్డి, ఐఎంఎల్ ఇన్‌చార్జి డిపో మేనేజర్, అనంతపురం

మోకాళ్లపై నడుస్తూ నిరసన



నిరసన తెలుపుతున్న పట్టు రైతులు, రీలర్లు

హిందూపురం అర్బన్ జనవరి 21: రాష్ట్రవ్యాప్తసమ్మెలో భాగంగా ఆదివారం 5వరోజు హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్ ఎదురుగా పట్టురైతులు, రీలర్లు మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా అధికారులను, రాయలసీమ వైసీపీ కో ఆర్డినేటర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, అప్పటి హిందూపురం వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను, ప్రభుత్వ సలహాదారు సజ్జలరామకృష్ణారెడ్డిని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను పలుమార్లు కలిసి న్యాయం చేయాలని కోరామన్నారు. అయినా స్పందనలేదన్నారు. సీఎంను కలిసి తమగోడును చెబుదామని సజ్జలను అడిగితే కుదరదని పంపేశారన్నారు. రైతు పార్టీ అని గొప్పలు చెప్పడం కాదని, వారి కష్టాలు, నష్టాలను తెలుసుకుని న్యాయం చేయాలన్నారు. ముఖ్యమంత్రి మాత్రం ప్యాలెస్ వదిలి రావడం లేదని విమర్శించారు. వెంటనే పట్టు రైతులకు అందాల్సిన ప్రోత్సాహకం అందించకపోతే రైతుల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టు రైతు రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సిద్దారెడ్డి, రాజేష్, నవీన్, రీలర్లు ముస్తాఫ, ఖలీల్, అన్సర్ ఉన్నారు.

టైర్ల షాపులో భారీ అగ్నిప్రమాదం







అగ్నికి ఆహుతైన టైర్లు, ఎగసిపడుతున్న మంటలు, అదుపు చేసేందుకు శ్రమిస్తున్న ఫైర్ సిబ్బంది

- మంటలను అదుపుచేయడానికి శ్రమించిన ఫైర్ సిబ్బంది
- తెల్లవారుజామున కావడంతో తప్పిన ప్రాణనష్టం
- నష్టం అంచనా వేయడానికి సమయం పడుతుంది: ఫైర్ సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, జనవరి 21: జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ మార్గ్‌లోని 80 అడుగుల రోడ్డులో ఉన్న టైర్ల షాపులో ఆదివారం ఉదయం 4 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అందుబాటులో ఉన్న రెండు ఫైర్ ఇంజన్లు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే భారీఎత్తున మంటలు ఎగిసిపడుతుంటంతో డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, ఏడీఎఫ్ఓ లింగమయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తాడిపత్రి, ధర్మవరం నుంచి రెండు ఫైర్‌ఇంజన్లను హుటాహుటినా తెప్పించారు. నాలుగు ఫైర్ ఇంజన్లు ఉన్నా ఎగిసిపడుతున్న మంటలను అదుపుచేయడం సిబ్బందికి సవాల్‌గా మారింది. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది అక్కడికి చేరుకుని ఫైర్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎట్టకేలకు మంటలను అదుపుచేశారు. ఈ సంఘటనతో స్థానికులు ఆందోళన చెందారు. నివాస గృహాలకు మంటలు వ్యాపిస్తాయేమోనని భయపడ్డారు. కాగా రూ. 60 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లివుంటుందని స్థానికులు చెబుతుండగా పూర్తిస్థాయిలో అంచనా వేయడానికి సమయం పడుతుందని ఫైర్‌సిబ్బంది పేర్కొన్నారు. అధికారుల బృందం పరిశీలించి అంచనా వేయడం జరుగుతుందన్నారు. కాగా ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా..? ఆకతాయిల పనా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడానికి అవకాశం చాలా తక్కువని, ప్రధానమార్గం కావడంతో ఆకతాయిల పనే అయి ఉంటుందని యంత్రాంగం అంటోంది. కావాలనే చేశారా..? ప్రమాదవశాత్తు జరిగిందా..? అన్నది విచారణలో తేలాల్సివుంది.

రేపు ఉరవకొండలో సీఎం జగన్ పర్యటన

అనంతపురం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. 10 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. 10.40 గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. అనంతరం అక్కడి నుంచి వాహనంలో సభావేదికకు చేరుకుంటారు. 10.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.35 గంటల వరకు వైఎస్‌ఆర్ ఆసరా నాలుగో విడత లబ్ధి మంజూరులో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడతారు. అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకొని స్థానిక నాయకులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 1.50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.20 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి 3.15 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 3.40 గంటలకు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకుంటారు.

బంగారు నగలు, నగదు చోరీ

పెనుకొండ టౌన్, జనవరి 21: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం ఉదయం మహిళ బ్యాగులో ఉంచిన పర్సులోని బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లారు. పెనుకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన ఆశ వారం క్రితం కర్ణాటకలోని పావగడకు వెళ్లింది. శనివారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. మధ్యాహ్నం పెనుకొండలో బస్సు దిగి రెండు బ్యాగులను తీసుకుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట డ్రైనేజీ కాలువపై పెట్టింది. ఆమె ఇద్దరు కుమారులు తినుబండారాల కోసం పరిసర ప్రాంతంలోని దుకాణానికి వెళ్లారు. వారు రావడం ఆలస్యం కావడంతో ఆమె దుకాణం వద్దకు వెళ్లి వారిని పిలుచుకుని వచ్చింది. ఈ సమయంలో బ్యాగులోని పర్సులో ఉన్న 15 గ్రాముల బంగారం నగలు, రూ.5వేలు నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లినట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెనుకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్లు మావి.. సీట్లు ఇతర ప్రాంతాల వారికా?

రాజకీయ పార్టీలకు పలు సంఘాల నాయకుల ప్రశ్న



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 21: ఇతర జిల్లాలు, రాష్ట్రాల వారికి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి నిలబెట్టి ఇక్కడి ప్రజలతో ఓట్లు వేయించుకుంటున్నారు.. అంటే ఓట్లు మావి.. సీట్లు ఇతర ప్రాంతాల వారికా..? అని పలు సంఘాల నాయకులు రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో 'రాజకీయ పార్టీల దిగుమతి విషసంస్కృతి' అనే అంశంపై ఆర్‌ఈఎఫ్, బీసీ/ఓబీసీ ఉద్యోగుల సంఘం, మాదిగ దండోరా, ఇతర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, బీసీ/ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా శ్రీధర్, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధికార ప్రతినిధి అక్కులప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధికి బడుగు, బలహీన, వెనుబడిన వర్గాలు కీలకంగా వ్యవహరిస్తున్నా రాజకీయంగా అన్యాయం జరుగుతోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయంచేస్తాం.. ఓట్లు వేయాలంటూ పార్టీలు మభ్యపెడుతున్నాయన్నారు. కులాలవారిగా టికెట్లను ఇవ్వాలనుకుంటే లోకల్ వారికే ఇవ్వాలన్నారు. ఇతర ప్రాంతాల వారికి ఇచ్చే విషసంస్కృతిని ఖండిస్తున్నామని తెలిపారు.

సాంబశివారెడ్డి ఇంట్లో మనిషికి ఎమ్మెల్యే టిక్కెట్టా..?

వైసీపీ నాయకుడు సాంబశివారెడ్డి ఇంట్లో పనిచేసే వీరాంజనేయులుకు శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలబెడుతున్నారని, అలాంటి వ్యక్తికి చట్టసభల్లో ప్రశ్నించే హక్కు ఉంటుందా అని ప్రశ్నించారు. సాంబశివారెడ్డి రాసిచ్చిన పేపర్‌ను చదివేవాడికి టిక్కెట్ ఇవ్వడం రాజకీయ క్రీడకు నిదర్శనమన్నారు. ప్రజల కోసం పనిచేసేవారికి కాకుండా పార్టీ విధానాలను అమలు చేసే వారికి టికెట్లు కేటాయిస్తున్నారన్నారు. పూలే, అంబేడ్కర్ ఆశయాలతో సమాజం కోసం పనిచేస్తున్న వారికి రాజకీయాల్లో అవకాశం కల్పించి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కమ్మారు నాగరాజు, రామకృష్ణ, గోవిందు, మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకంతో నగదు మళ్లింపు

ఆర్‌అండ్‌బీలో ఓ సూపరింటెండెంట్ నిర్వాకం

అనంతపురం క్రైం, జనవరి 21: ప్రభుత్వ సొమ్మును ఓ ఉద్యోగి సొంత ఖాతాకు మళ్లించుకున్నాడు. అర్‌అండ్‌బీలో ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తన ఖాతాకు సూపరింటెండెంట్ డబ్బును జమచేసుకున్నాడు. ఈ మేరకు టూటౌన్‌లో కేసు నమోదైంది. సీఐ శివరాముడు వివరాలు తెలిపారు. ఆర్‌ఆండ్‌బీలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగరాజు ప్రభుత్వ అకౌంట్‌కు సంబంధించి ఆ శాఖకు చెందిన ఓ చెక్‌పై ఈఈ ప్రసాద్‌రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.7,67,744లు తన అకౌంట్‌కు మళ్లించాడు. విషయం తెలుసుకున్న ఈఈ ప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. కాగా విషయం బయటకు పొక్కడంతో ఆ డబ్బును తిరిగి ప్రభుత్వ ఖాతాకు సూపరింటెండెంట్ మళ్లించినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ రైతు మృతి

కదిరిఅర్బన్, జనవరి 21: ఆత్మహత్యకు యత్నించిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కదిరి మండలం కాళసముద్రం గ్రామానికి చెందిన జయప్ప (66) ఈనెల 19వతేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. జయప్ప తనకున్న ఆరెకరాల పొలంలో మూడు బోర్లు వేసి వేరుశనగ, టమోటా సాగు చేశాడు. పంటల పెట్టుబడి, బోర్లు వేయడానికి రూ.5లక్షల వరకు అప్పుచేశాడు. పంటల దిగుబడి సరిగా లేకపోవడంతో అప్పు తీర్చే మార్గం కనిపించక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుమారుడు తిరుపతయ్య ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీలో అసమ్మతి సెగలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

వైసీపీలో అసమ్మతి సెగలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. నూతన ఇన్‌చార్జిల నియామకం జరిగిన తరువాత పార్టీలో అసమ్మతి ఎక్కువవుతూ వస్తోంది. తాజాగా మోపురుగుండు చంద్రశేఖర్ గుడిబండలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్పపై పలు ఆరోపణలు చేశారు. ధర్మవరంలోని వైసీపీ 27వ వార్డు ఇన్‌చార్జి డోలా రాజారెడ్డి.. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తీరు నచ్చక పార్టీ వీడనున్నట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ అసమ్మతి సెగలు మరింత ఎక్కువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మడకశిర, జనవరి 21: గత స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిన ఈరలక్కప్పను వైసీపీ సమన్వయకర్తగా ఏవిధంగా నియమిస్తారని గుడిబండ సింగిల్‌విండో అధ్యక్షుడు మోపురుగుండు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గుడిబండ పోలీస్‌స్టేషన్‌లో అతడిపై కేసులు నమోదయ్యాయన్నారు. అప్పట్లో పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలకు పాల్పడి పార్టీ సస్పెన్షన్‌కు గురయ్యారన్నారు. అటువంటి వ్యక్తిని ఏవిధంగా సమన్వయ కర్తగా నియమిస్తారని మండిపడ్డారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డిపై తిరుగుబాటు

వైసీపీకి గుడ్‌బై చెప్పే యోచనలో డోలా రాజారెడ్డి



డోలా రాజారెడ్డి

ధర్మవరం: ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై సొంతపార్టీలో తిరుగబాటు మొదలైందా? ఆయన వ్యవహార శైలిపై చాలా మంది నేతలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారా? సరైన సమయం చూసి చాలా మంది పార్టీకి గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నారా..? అన్న ప్రశ్నలకు ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అవును అనే సమాధానం వినిపిస్తోంది. నియోజకవర్గంలో నేనే మోనార్క్ అనేలా ఎమ్మెల్యే వ్యవహార శైలి ఉండటం వల్ల చాలా మంది సీనియర్ నాయకుల సైతం నాలుగున్నఏళ్లగా బయటకు చెప్పుకోలేక లోలోపల మథనపడుతూ ఇంత కాలం నెట్టుకొచ్చారనే అభిప్రాయం వినిపిస్తోంది. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇదే సరైన సమయం అని ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం చెప్పాలనే యోచనలో పలువురు నాయకులు ఉన్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే ప్రస్తుతం ధర్మవరం 27వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్ డోలా రాజారెడ్డి పార్టీని వీడతారనే ప్రచారం ధర్మవరంలో సాగుతోంది. ఎమ్మెల్యేతో డోలారాజారెడ్డికి చాలా కాలంగా విభేదాలు ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీలో తాను వార్డు ఇన్‌చార్జ్‌గా ఉండటంతోపాటు తనభార్య డోలా ఓబుళమ్మ కౌన్సిలర్‌గా ఉన్నప్పటికీ పార్టీలో సరైన ప్రాధాన్యత లేకపోవడం వల్ల వారి మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో వార్డు ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి రాజారెడ్డిని తప్పించి జడ్పీవైస్‌చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డికి అప్పగించినట్టు తెలిసింది. దీంతో ఇక వైసీపీలో కొనసాగడం ఏ మాత్రం మంచిదికాదన్న అభిప్రాయంలో డోలా ఉన్నట్టు సమాచారం. డోలా రాజారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డిని ఇటీవల కలవడం ధర్మవరంలో చర్చనీయాంశంగా మారింది. తన సహచరులు, పార్టీ శ్రేణులతో చర్చించిన తరువాత వైసీపీని వీడతారనే ప్రచారం సాగుతోంది. డోలా బాటలో మరికొందరు నేతలు ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే కొందరు చేనేత వర్గీయులు ఎమ్మెల్యేతీరు నచ్చక తీవ్ర అసంతృప్తితో అంతర్గతంగా ప్రధానప్రతిపక్ష పార్టీ నాయకులను ఆశ్రయించినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉన్న చేనేత వర్గానికి చెందిన చందారాఘవ ఇటీవల తన వార్డులో పర్యటించిన ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను స్వయంగా ఇంటికి ఆహ్వానించిన సంఘటన ఎమ్మెల్యేపై అసమ్మతిని తెలియజేస్తోంది. ఇంకా మరికొందరు చేనేత వర్గీయులు లోలోపల ప్రతిపక్షపార్టీలనాయకులకు టచ్‌లో ఉన్నట్టు సమాచారం. ఎన్నికల సమీపిస్తున్న వేళ ఎమ్మెల్యేపై ఉన్న అసమ్మతి రాగం రోజురోజుకు మరింత బహిర్గతమవుతుందన్న వాదన ధర్మవరంలో వినిపిస్తోంది.

బీజేపీకి వజ్ర భాస్కర్‌రెడ్డి రాజీనామా



కదిరి, జనవరి 21: బీజేపీకి శ్రీసత్యసాయి జిల్లా మాజీ అధ్యక్షుడు వజ్ర భాస్కర్‌రెడ్డి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం తెలిపారు. అనివార్య కారణాలు, పార్టీలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాజీనామా చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడికి పంపినట్లు వివరించారు.

ఏబీఎన్ విలేకరికి పురస్కారం



కదిరి, జనవరి 21: ఏబీఎన్ కదిరి విలేకరి నరసింహులుకు గిడుగు రామ్మూర్తి జీవన సాఫల్య జాతీయ అవార్డు దక్కింది. ఈ అవార్డును సోమవారం సాయంత్రం హైదబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన అందుకోనున్నారు. తెలుగు వ్యావహారిక భాషోద్యమంలో పాలుపంచుకున్నందుకు అవార్డు లభించినట్లు నరసింహులు తెలిపారు. పాత్రికేయుడిగా చివరి వరకు కొనసాగడమే తన లక్ష్యమన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

లేకుంటే దశల వారీ ఉద్యమం

రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య

అనంతపురం విద్య, జనవరి 21: ఆశా వర్కర్లకు కనీస వేతనంగా రూ. 26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆశా వర్కర్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 50 వేల మంది వర్కర్లు పనిచేస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా ఉద్యమాన్ని చేస్తామన్నారు. కేంద్రం ఇచ్చే రూ. 3500లతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం వేతనం పెంచినట్టు చెప్పడం సరికాదన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి నిలిపివేయడం దుర్మార్గమన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పనిచేశారన్నారు. కొందరు మరణిస్తే వారికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పి ఇంతవరకు 50పైసలు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగవేణి, ఏజీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఇతర నాయకులు కృష్ణుడు, ఫాతిమా, చిట్టి, సుగుణ, దుర్గమ్మ, అనంత లక్ష్మి, హసీనా, అనీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

వైసీపీ ఖాళీ అవ్వడం ఖాయం

● మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ● ఆయన ఆధ్వర్యంలో 150 కుటుంబాలు టీడీపీలోకి చేరిక


కొత్తచెరువులో పల్లె సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ శ్రేణులు

కొత్తచెరువు, జనవరి 21: పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవ్వడం ఖాయమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల ఆవరణలో ఆదివారం మాజీ మంత్రి పల్లె సమక్షంలో కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణతో పాటు దాదాపు 150 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వీరందరికీ పల్లె కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ... కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ సౌమ్యుడని, పేదల కోసం అహర్నిశలు కృషిచేసే నాయకుడని, అలాంటి వ్యక్తి టీడీపీలోకి చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి మచ్చుకైనా కానరాలేదన్నారు. నిధులు లేక గ్రామాలలో అభివృద్ధి జరగకపోవడంతో ఆ పార్టీలో నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు ప్రజలకు మొహం చూపించలేని పరిస్థితులలో ఉన్నారన్నారు. దీంతో వైసీపీ విధానాలు నచ్చక అనేక మంది టీడీపీలోకి చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వడ్డే ఓబన్న, కనకదాసు, వాల్మీకి మహర్షి, శ్రీకృష్ణదేవరాయలు, ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాల వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీలోకి ఎవరొచ్చినా స్వాగతిస్తాం

కొత్తచెరువు, జనవరి 21: టీడీపీ మహాసముద్రమని, ఇందులోకి ఎవరొచ్చినా స్వాగతిస్తామని ఆ పార్టీ హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిది సాలక్కగారిశ్రీనివాసులు అన్నారు. మండలకేంద్రంలోని ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సమక్షంలో టీడీపీకి చేరారని, వారి చేరికను ఆహ్వానిస్తున్నామని అన్నారు. పార్టీలోకి ఎవరొచ్చినా సాదరంగా ఆహ్వానిస్తామమన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ గెలుపునకు అందరు సమష్టిగా కృషి చేయాలన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

● వడ్డిపల్లిలో 50 కుటుంబాల వారు కందికుంట సమక్షంలో చేరిక



టీడీపీలోకి చేరినవారితో కందికుంట వెంకటప్రసాద్

నంబులపూలకుంట, జనవరి 21: వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో మండలంలోని వడ్డిపల్లి గ్రామంలో ఆదివారం దాదాపు 50కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారందరూ పార్టీలోకి చేరారు. తొలుత కందికుంట వెలిచెలమల క్రాస్‌కు చేరుకోగానే పార్టీ శ్రేణులు పూల వర్షం కురిపించారు. భారీ ఎత్తున బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వడ్డుపల్లిలో వేదికపైకి ఆయన చేరుకుని వైసీపీని వీడిని వారిని టీడీపీలోకి చేర్చుకున్నారు. కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. కేవలం 80రోజుల్లో ఎన్నికలు రానున్నాయన్నారు. ఎన్నికలు దగ్గర పడేకొద్ది వైసీపీ వారిలో వణుకు మొదలైందన్నారు. వైసీపీ అగ్ర నాయకులు కదిరిలో తిష్ట వేసి ఆ పార్టీని వీడే వారిని భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారన్నారు. సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సజ్జలరామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల్లో పెట్టారని విమర్శించారు. అందులో ఒకరైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కదిరిలో ఇళ్లిళ్లు తిరుగుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడకుండా ఉండేందుకు బుజ్జగింపులు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. మరలా ఈనెల 24న ఆయన కదిరికి వస్తారంట, నాయకులంతా సిద్ధంగా ఉండాలని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోందన్నారు. జగన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రజలకు అనేక హామీలిచ్చారని, అయితే అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. మద్యపాన నిషేధం చేస్తామని హామీ ఇచ్చి, బూమ్‌బూమ్ బీర్లు తెచ్చారన్నారు. అమ్మఒడికి పంగనామాలు పీకారన్నారు. కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయన్నారు. జాబ్‌క్యాలెండర్ వట్టిదేనని యువతకు తెలిసిపోయిందన్నారు. దీంతో వైసీపీ అంతా బూటకపు పార్టీ అని అందరూ టీడీపీ వైపుమొగ్గు చుపుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం విజయఢంకా మోగిస్తుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీలో ఏళ్ల తరబడి శ్రమించిన నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లేకపోయిందన్నారు. అలాంటి వారికి టీడీపీ ద్వారాలు తెరుచుకునే ఉంటాయన్నారు. తెలుగుదేశంలో కార్యకర్తలు, నాయకులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ లో చేరినవారిలో ఉప సర్పంచ్ వెం కటయ్య, మాజీ సర్పంచ్ రమణ య్య, ఓర్సు బాబుతోపాటు 50 కుటుంబాల వారు చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, నాయకులు విజయకుమార్ యాదవ్, బసిరెడ్డి, బాషా, దండే రవి, శ్రీరాములనాయుడు, అం జనప్పనాయుడు, పోమేనాయక్, రవినాయక్, హరిప్రసాద్, గంగశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్ పెంచండి..

వడ్డిపల్లిలో కందికుంట వెంకటప్రసాద్‌ను తలుపుల మండలం మడుగుతండాకు చెందిన దివ్యాంగుడు చిన్నరెడ్డెప్ప నాయక్‌కలిసి మాట్లాడారు. తాము వైసీపీ కోసం ఎంతో శ్రమించి గెలుపునకు కృషిచేశామన్నారు. అయితే ఆ ప్రభుత్వం అందరికీ పింఛన్లు పెంచి దివ్యాంగులకు మాత్రం పెంచలేదన్నారు. దీంతో వైసీపీపై విరక్తి కలిగిందన్నారు. ఇప్పటి నుంచి టీడీపీ కోసం పనిచేస్తామన్నారు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే తమకు పింఛన్లు పెంచేలా చేయాలని కందికుంటను కోరారు. స్పందించి కందికుంట టీడీపీ అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు ఓటరు జాబితా

పుట్టపర్తి, జనవరి 21: సార్వత్రిక ఎన్నికల వేళ నూతన ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. సోమవారం తుది జాబితా వెలువడనుంది. ఇందుకోసం ఆరు నెలలుగా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో అధికారులు విడతల వారీగా సర్వేలు నిర్వహించారు. ఈనెల 12న నమూనా జాబితా విడుదల చేశారు. ఇందులో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో కలిపి 1561 పోలింగ్ కేంద్రాల పరిధిలో 13,91,628 మంది ఓటర్లున్నారు. పురుషులు 6,94,446 మంది, మహిళలు 6,97,119 మంది, ఇతరులు 63 మంది ఉన్నారు. అత్యధికంగా కదిరి నియోజకవర్గంలో 2,50,776 మంది ఓటర్లు ఉండగా.. అతి తక్కువగా పుట్టపర్తి నియోజకవర్గంలో 2,10,076 మంది ఓటర్లున్నారు. వీరుగాక మరికొంతమంది నూతన ఓటర్లు తుది జాబితాలో చేరనున్నారు.

ఫిర్యాదులు పరిష్కారమయ్యేనా?

బోగస్ ఓట్లు ఉన్నాయని, ప్రతిపక్ష నాయకులు పలుమార్లు ఫిర్యాదు చేసింది విదితమే. అధికార పార్టీ నాయకులు బోగస్ ఓటర్లను చేర్చారంటూ ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్నికల అధికారులు సమగ్ర విచారణ చేసి, ఓటరు జాబితాను తప్పులు లేకుండా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఫారం-4 ద్వారా చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగిస్తారు. ఫారం- 8 ద్వారా ఓటరు చేర్పులు, మార్పులు చేస్తారు. కాగా ఈరెండింటినీ బీఎల్వోలు సక్రమంగా నిర్వహించలేదన్న ఫిర్యాదులున్నాయి. అయితే ఏమాత్రం పూర్తి స్థాయిలో ఓటరు జాబితా వెలువడతాదో తెలియనున్నది.

ప్రత్యేక పరిశీలకులు..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఓటరు జాబితా తయారీకి ఎన్నికలాధికారులు ప్రత్యేక పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించారు. పలు రాజకీయ పక్షాలు ఫిర్యాదులు చేయడంతో ఎన్నికలాధికారులు మరీ చొరవ తీసుకుని స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారు చేయడానికి ప్రత్యేక పరిశీలకులను నియమించినట్లు తెలుస్తోంది. జిల్లాలో గత ఐదురోజులుగా ప్రత్యేక పరిశీలకుల పర్యవేక్షణలో ఓటరు జాబితా సిద్ధమవుతోంది.

పెరగనున్న నూతన ఓటర్లు..

నూతన ఓటర్ల నమోదుతో ఓటర్ల సంఖ్య పెరగనున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు నూతనంగా లక్షమంది ఓటర్లుపెరిగే అవకాశాలున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 80శాతం ఓటర్లు 18ఏళ్ల నిండిన యువతి,యువకులే ఉండే అవకాశముంది. వారందరూ రానున్న ఎన్నికల్లో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

రాములవారి పూజకు ఏర్పాట్లు పూర్తి


ఆర్వీజే కల్యాణమండపంలో పూజకు సిద్ధమైన సీతారామలక్ష్మణసమేత ఆంజనేయ విగ్రహాలు

పుట్టపర్తి రూరల్, జనవరి 21: అయోధ్య రామాలయంలో సోమవారం శ్రీరాముల వారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలో రాములవారి ప్రత్యేక పూజలకు విశ్వహిందూపరిషత్ కమిటీ సర్వం సిద్ధం చేసింది. పట్టణంలోని ఆర్వీజే కల్యాణమండపంలో పూజాదికార్యాక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇందులో భాగంగా నేటి ఉదయం 8:30 నుంచి 10:30 గంటల వరకు వేదపండితులచేత ప్రత్యేక పూజలు, 11గంటల నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు, 11:45నుంచి అయోధ్యలో రామాలయంలో నిర్వహించే రామోలోరి విగ్రహప్రాణప్రతిష్ఠ కార్యక్రమం లైవ్ ప్రోగ్రాం వీక్షణ, అనంతరం భజన, మహామంగళహారతి, భక్తులకు తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందుకు సుమారు వెయ్యిమంది భక్తులు ఆసీనులు కావడానికి ఏర్పాట్లను పూర్తిచేసినట్లు పేర్కొన్నారు.

యువగళం వలంటీర్‌కు ఘనసన్మానం


గడిపూటి విజయ్‌చౌదరిని సన్మానిస్తున్న కాలువ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్, జనవరి21: మండలంలోని చిన్నూరు బత్తలపల్లికి చెందిన తెలుగుయువత రాష్ట్రఅధికార ప్రతినిధి గడిపూటి విజయ్‌చౌదరి, టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో వలంటీర్‌గా సేవలు అందించారు. పాదయాత్ర ప్రారంభం నుంచి పూర్తి అయ్యేవరకు నారాలోకేశ్ వెంట నడిచిన వలంటీర్లకు మాజీమంత్రి కాలువ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం టీడీపీ కార్యాలయంలో ఘనసన్మానం జరిగింది. ఈ సందర్భంగా విజయ్‌చౌదరికి కాలువ శ్రీనివాసులు శాలువ కప్పి మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు.

కులగణన సర్వే పరిశీలన


కులగణన సర్వేని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తనకల్లు, జనవరి 21: మండలంలోని నల్లగుట్లపల్లిలో ఆదివారం ఎంపీడీఓ పూల నరసింహులు కులగణన సర్వేను పరిశీలించారు. కార్యదర్శి రాజశేఖర్‌ను అడిగి వివరాలను తెలుసుకున్నారు. త్వరగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వేలో వలంటర్లు పాలు పంచుకుని త్వరగా సర్వే పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ సరేష్‌రెడ్డి, వలంటీర్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నరేంద్ర (ఫైల్)

తాడిమర్రి, జనవరి 21: మండలంలోని మోదులకుంట గ్రామ సమీపంలో ఈ నెల 16వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు నరేంద్ర(23) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన అతడిని కుటుంబసభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ నాగస్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరవధిక సమ్మె


మహమ్మదాబాద్ క్రాస్‌లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఓబుళదేవరచెరువు, జనవరి 21: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు 41వరోజైన ఆదివారం కూడా సమ్మెను కొనసాగించారు. మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట వారు బైఠాయించి తలపై కొంగు వేసుకుని నిరసన తెలిపారు. అంతకుముందు పోలీసులు నోటీసులు ఇవ్వడానికి రాగా.. తీసుకోవడానికి అంగన్‌వాడీలు నిరాకరించారు. తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. వారికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మద్దతు పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ కుళ్లాయప్ప, శ్రీరాములు, ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు అంగన్వాడీలు..

బత్తలపల్లి: మండలంలోని కొంత మంది అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అంగన్వాడీలు తెలిపిన మేరకు.. పోలీసులు తొలుత పోట్లమర్రి గ్రామంలోని అంగన్‌వాడీల వద్దకు వెళ్లి పోలీస్ స్టేషన్‌లో సంతకాలు చేసేందుకు రావాలని వాహనం ఎక్కించారన్నారు. అక్కడ నుంచి వేల్పుమడుగు,గంటాపురం,గుమ్మల్లకుంట గ్రామాలకు వెళ్లి అక్కడి అంగన్‌వాడీ కార్యకర్తలను కూడా పోలీస్ వాహనంలో ఎక్కించి స్టేషన్‌కు తరలించారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్టేషన్‌లోనే కూర్చోబెట్టారని, అనంతరం సంతకాలు చేయించుకుని వదిలారని వాపోయారు.

గ్రామాల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్


పోట్లమర్రిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

బత్తలపల్లి, జనవరి 21: మండలంలోని పోట్లమర్రి, వేల్పుమడుగు గ్రామాల్లో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్షన్ లీడర్ల ఇళ్లు, మద్యం, గుట్కా అమ్మేవారి ఇళ్లల్లో తనిఖీ చేశారు. అనంతరం ఆయా గ్రామస్థులతో ఎస్‌ఐ శ్రీనివాసులు సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో ఎవరూ గొడవలకు పోరాదన్నారు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఎవరైనా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే తమకు సమాచారం ఇవ్వాలని గ్రామస్థులకు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ శతజయంతి


లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు

పుట్టపర్తి, జనవరి 21: ప్రపంచానికి సోషలిస్టు సమాజాన్ని పరిచయం చేసిన లెనిన్ శతజయంతి వేడుకల్ని ఆదివారం పట్టణంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య మాట్లాడుతూ పెట్టుబడి దారీ వ్యవస్థను రూపుమాపి సమాజ మార్పు కోసం పాటు పడిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వల్లం రాజేంద్రప్రసాద్, గంగాధర్, సావిత్రమ్మ, పవన్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం


కరపత్రాలు పంచుతున్న సామకోటి ఆదినారాయణ తదితరులు

పుట్టపర్తిరూరల్, జనవరి 21: ప్రజా సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని మూడో వార్డులో ఆదివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీ మేనిఫెస్టో పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఇందులో తల్లికి వందనం, ఆడబిడ్డనిధి, దీపంపథకం, నిరుద్యోగ భృతి తదితర పథకాల గురించి తెలియజేశారు. వీటి వల్ల ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలిపారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజాసంక్షేమం ఆయనతోనే సాధ్యమన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉమాపతియాదవ్, బేకరీనాయుడు, మేకల ఈశ్వర్, చెన్నప్ప, వెంకటరాముడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ


గాజులపల్లిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వడ్డెర నాయకులు

అమడగూరు, జనవరి 21: మండలంలోని గాజులపల్లి సమీపంలో గల శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమంలోని వృద్ధ మహిళలతో పాటు గ్రామంలో దాదాపు ఐదు వందలమంది మహిళలకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దళవాయి వెంకటనారాయణ, ఉపాధ్యక్షుడు సిమెంటు పోలన్న వాటిని పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వలిపి కిష్టప్ప, రామచంద్ర, తిరుపాల్, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త వేమన

హిందూపురం, జనవరి 21: ప్రజాకవి యోగివేమన సంఘ సంస్కర్త అని రెడ్డి సంఘం నాయకులు పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలోని తెలుగుతల్లి సర్కిల్ నుంచి బెంగళూరు రోడ్డులో ఉన్న వేమన విగ్రహం వరకు ఆదివారం రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రబోధానందస్వామి శిష్యబృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డికులస్థులు మాట్లాడుతూ... తెలుగువారి చరిత్ర, సంస్కృతి సాహిత్యాల్లో విశిష్టమైన స్థానం కలిగిన మహనీయుడు వేమన అన్నారు. ఆయన ఏ కులం, ఏమమతం అనేదానికంటే ప్రస్తుత సమాజానికి ఉప యోగపడే పద్యాలను అందించారన్నారు. ప్రజాకవిగా ఈ సమాజానికి ఉపయోగపడే పద్యాలను ఎన్నో అందించారన్నారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌రెడ్డి, బలరాంరెడ్డి, మధుమతిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శతమానం భవతి

● ఘనంగా వైట్‌ఫీల్డ్ హాస్పిటల్ వార్షికోత్సవం


మాట్లాడుతున్న వైట్‌ఫీల్డ్ హాస్పిటల్ డైరెక్టర్ సుందరేశ్

పుట్టపర్తి, జనవరి 21: సత్యసాయి విద్యార్థులు చేపట్టిన శతమానం భవతి నృత్య నాటిక భక్తులను అలరించింది. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో గల శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు సంబంధించి 23వ వార్షికోత్సవాన్ని పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్ హాల్లో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత హాస్పిటల్ డైరెక్టర్ సుందరేశన్ సత్యసాయి చూపిన సేవామార్గంలో నిరంతర వైద్యసేవలు కొనసాగిస్తున్నామన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ ఉచిత వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. అనంతరం సత్యసాయి విద్యార్థులు శతమానం భవతి అనే నాటికను అద్భుతంగా ప్రదర్శించారు. అలాగే వైద్యులు, మెడికల్ సిబ్బంది భక్తిగీతాలు ఆలపించారు. తర్వాత వారందరూ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.


పాటలు పాడుతున్న హాస్పిటల్ సిబ్బంది


నాటికలో భాగంగా నృత్యం చేస్తున్న సత్యసాయి విద్యార్థులు

భద్రతా ఏర్పాట్ల పరిశీలన


విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జనవరి 21: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో భాగంగా జిల్లాకేంద్రంలో గల శ్రీసత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఏఎస్ఎల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న ముఖ్యమంత్రి అనంతపురం జిల్లా ఉరవకొండలో పర్యటించనున్నారన్నారు. ఆ రోజున ఉదయం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేకవిమానంలో ఇక్కడకు చేరుకుంటారన్నారు. 10గంటలకు ఈ ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి ఉరవకొండ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. తిరిగి మధ్యాహ్నం 2:30గంటలకు సత్యసాయి ఎయిర్‌పోర్టుకు వచ్చి ఇక్కడినుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళతారని పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన వారిలో అదనపు ఎస్పీ విష్ణు, డీఎస్పీ వాసుదేవన్, ఏఆర్‌డీఎస్పీ విజయ్‌కుమార్ స్పెషల్‌బ్రాంచ్ సీఐ రవీంద్రనాథరెడ్డి ఉన్నారు.

మూర్ఛ ప్రాణాంతకం కాదు

కదిరిఅర్బన్, జనవరి 21: మూర్ఛ రోగం ప్రాణాంతకం కాదని, వారు ఒంటరిగా ప్రయాణం చేయకుండా.. నిప్పుకు దూరంగా ఉండాలని, బావులు, స్విమ్మింగ్‌పూళ్ల వద్దకు వెళ్లరాదని నరాల వైద్యుడు డాక్టర్ గోపాలం శివ నారాయణ సూచించారు. క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందని తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో ఆదివారం కదిరి శాఖ జేవీవీ ఆధ్వర్యంలో మూర్ఛరోగులకు వైద్య శిబిరం నిర్వహించారు. హాజరైన రోగులకు నాలుగు నెలలకు సరిపడే మందులను నామ మాత్రం ధరలతో అందించారు. మే 19న తదుపరి శిబిరం నిర్వహిస్తామని జేవీవీ ఉపాధ్యక్షుడు నరసారెడ్డి తెలిపారు. వైద్యుడు మహబూబ్‌బాషా తదితరులు ఉన్నారు.

రామాలయంలో నేడు ప్రత్యేక పూజలు

ఓబుళదేవరచెరువు, జనవరి 21: అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహావిష్కరణ సందర్భంగా మండలకేంద్రంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజల అనంతరం అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

ధర్మవరంలో స్క్రీన్ల ఏర్పాటు

ధర్మవరం, జనవరి 21: అయోధ్య రామమందిరంలో సోమవారం జరిగే బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులు తిలకించడానికి వీలుగా పట్టణంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ స్క్రీన్లను ఏర్పాటు చేయనున్నట్లు గోనుగుంట్ల అనుచరులు తెలిపారు. స్థానిక గోనుగుంట్ల కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోనుగుంట్ల సూర్యనారాయణ తన సొంత ఖర్చులతో పట్టణంలోని ప్రధానకూడళ్లలో, ప్రముఖ ఆలయాల వద్ద స్క్రీన్లను, ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిష్‌రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్, బోడగలగిరిధర్, దుస్సాక్రిష్ణ, సరితాల దస్తగిరి, రాప్తాటిరాము, పల్లాగోపాలక్రిష్ణ, మార్కెట్‌రహీం, గంధమనేని నారాయణస్వామి, కొండాశీన పాల్గొన్నారు.

వైభవంగా గోదాకల్యాణం

ధర్మవరంరూరల్, జనవరి21: పట్టణంలోని తేరు బజారులో ఉన్న వాసవీ కల్యాణమండపంలో ఆదివారం శ్రీరామ భజన మందిరం ఆధ్వర్యంలో గోదారంగనాయకుల స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనాథ్‌శర్మ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవ వేడుకలను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీరామభజన మందిరం నిర్వాహకులు దేవతాకృష్ణమూర్తి, కోటిలక్ష్మీవెంకటేశ్వర్లు, జయంతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేకాలంకరణలో ఉత్సవ మూర్తులు

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

మండిపడ్డ అంగన్‌వాడీలు
పట్టణంలో ర్యాలీ, రాస్తారోకో
స్టేషన్‌కు తరలించిన పోలీసులు



పురంలో ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీలు


అంగన్‌వాడీలను అరెస్టు చేస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా 41వ రోజు ఆదివారం హిందూపురంలో ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి, రాస్తారోకో చేపట్టారు. దీంతో పోలీసులు పలువురు అంగన్‌వాడీలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంగన్‌వాడీల యూనియన్ నాయకులు మాట్లాడుతూ... విజయవాడలో అంగన్‌వాడీల దీక్షను పోలీసులు బలవంతంగా భగ్నం చేయడం దుర్మార్గమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు సోమవారం విజయవాడ వెళతారని ముందస్తు సమాచారంతో పోలీసులు యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, మేళాపురం సెంటర్ అరుణ, సీఐటీయూ నాయకుడు రమణ తదితరులను అరెస్టు చేశారు. కొందరు తప్పించుకున్నారు. అయితే తమ నాయకులను వదిలిపెట్టాలని మిగిలిన అంగన్‌వాడీలు స్టేషన్ వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. అదేవిధంగా పెనుకొండ, చిలమత్తూరు, లేపాక్షి, సోమందేపల్లి, మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ తదితర చోట్ల నిరసన కొనసాగించారు.


లేపాక్షిలో మౌనదీక్షలో అంగన్‌వాడీలు


పెనుకొండలో చేతిలో చిప్ప పట్టుకుని నిరసన


మడకశిరలో 41 ఆకారంలో కూర్చుని, నిరసన

యానిమేటర్లపై ప్రభుత్వం చిన్నచూపు

నియోజకవర్గ అధ్యక్షుడు సిద్ద గంగప్ప

అగళి, జనవరి 21: వెలుగు పథకంలో పనిచేస్తున్న యానిమేటర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని యానిమేటర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సిద్ద గంగప్ప పేర్కొన్నారు. యానిమేటర్ల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సమైక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పనిచేస్తున్న యానిమేటర్ల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ద గంగప్ప మాట్లాడుతూ... తాము అధికారంలోకి వచ్చిన తర్వాత యానిమేటర్లు జీతాలను రూ.10వేలు పెంచుతామని గతంలో ముఖ్యమంత్ర జగన్ హామీ ఇచ్చారన్నారు. అయితే రూ.8వేలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వేతనాల పెంపు తదితర డిమాండ్లపై ఈనెల 30 తేదీన విజయవాడలో జరిగే యానిమేటర్ల బహిరంగ సమావేశానికి తరలి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు రెండు రోజులపాటు అక్కడే ఉండాల్సి ఉందని ప్రతి ఒక్కరూ తరలి రావాలని ఆయన కోరారు. సమావేశంలో నియోజకవర్గంలోని యానిమేటర్లు పాల్గొన్నారు.

రంగధామప్ప మృతి పార్టీకి తీరనిలోటు : గుండుమల

మడకశిర రూరల్, జనవరి 21 : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రంగధామప్ప మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆయన ఆదివారం ఆమిదాలగొంది గ్రామానికి వెళ్లి రంగధామప్ప చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సజావుగా సూపర్-6 పరీక్షలు

అగళి, జనవరి 21 : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిస్వార్థ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూపర్-6 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు, ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు పర్యవేక్షించారు. విద్యార్థులు రాస్తున్న పరీక్షలపై ఆరాతీశారు. పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ చిత్రలిం గప్ప, ఉపాధ్యాయురాలు రంగన్న, శ్వేత, నిస్వార్థ మడ కశిర కోఆర్డినేటర్ నర్సంబుది రంగరాజు తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

గుడిబండ, జనవరి 21: మండలంలోని జమ్ములబండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌ను టీడీపీ నాయకులు జయరాం తదితరులు ఆదివారం కలిసి పరామర్శించారు. మాజీ సర్పంచ్ శ్రీనాథ్ తుమకూరు ప్రభుత్వాసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా టీడీపీ నాయకులు పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు రామాంజనేయులు, గోపాల్‌నాయక్, నాగేంద్ర, గోవిందరాజులు, శ్రీనివాసులు, రాజు తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోరంట్ల, జనవరి 21: కర్ణాటక నుంచి మద్యం అక్రంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని మండలంలోని కమ్మలవాండ్లపల్లి సరిహద్దులో ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. వానవోలు గ్రామానికి చెందిన అతడు ద్విచక్రవాహనంపై బాగేపల్లినుంచి 120 టెట్రా ప్యాకెట్లు కర్ణాటక మద్యాన్ని తీసుకొస్తుండగా, పోలీసులు పట్టుకున్నారు. ద్విచక్రవాహనంతోపాటు మద్యాన్ని స్వాధీనం చేసుకుని, అతడి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

మంత్రి, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య బయటపడిన విభేదాలు

అతిథి పాత్రలో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ

శిలాఫలకంలో కనిపించని ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ పేరు


మావటూరులో గ్రామ సచివాలయం ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీ

పెనుకొండ రూరల్, జనవరి 21 : ఎన్నికల కోడ్ వచ్చేవరకు పెనుకొండ నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఆయనే. ఆయన ఆధ్వర్యంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, భూమి పూజ కార్యక్రమాలు చేపట్టాలి. అలాంటి ఎమ్మెల్యే పేరును పెద్ద పెద్ద అక్షరాలతో శిలాఫలకాల్లో ప్రారంభకుల స్థానంలో లిఖించాల్సి ఉంటుంది. అయితే పెనుకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ బాధ్యతను మంత్రి ఉషశ్రీ చరణ్ చేపట్టిన తరువాత ఆమె అనుచర వర్గం స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నారాయణ పేరును ఓ శిలాఫలకంలో అతిథిస్థానంలో చేర్చడం చర్చనీయాంశంగా మారింది. మావటూరు సచివాలయ ప్రారంభోత్సవం కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీ చరణ్ తీరుపై ఎమ్మెల్యే అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ గ్రామ సచివాలయాన్ని ఆదివారం మంత్రి ఉషశ్రీ చేతులమీదుగా ప్రారంభించారు. శిలాఫలకంలో అతిథిపాత్రలో శంకర్‌నారాయణ పేరును, పెనుకొండ నగర పంచాయతీ కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి పేరును విశిష్ట అతిథి స్థానంలో రాయడం వివాదాస్పదంగా మారింది. ఇదిలాఉండగా స్థానిక నేత, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ పేరును అస్సలు రాయకపోవడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మంత్రి ఉషశ్రీ చరణ్ తీరును ఎమ్మెల్యే శంకర్‌నారాయణ అనుచరవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా

నేను కొన్నేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్నాను. ఎమ్మెల్యే శంకర్‌నారాయణ తనను గుర్తించి రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవిని ఇప్పించారు. మావటూరులో మంత్రి ఉషశ్రీ చరణ్ గ్రామ సచివాలయ ప్రారంభోత్సవం చేశారు. శిలాఫలకంలో నాపేరు లేకపోవడంతో చాలా బాధ పడుతున్నా. ఈ విషయాన్ని శంకర్‌నారాయణ దృష్టికి తీసుకెళ్లాను. త్వరలోనే సీఎం దృష్టికి తీసుకెళ్తాను.

- నరసింహప్ప, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్

అప్రకటిత విద్యుత్ కోతలు

రైతులకు తప్పని కష్టాలు


రాత్రివేళ రాగి పైరు నాటుతున్న కూలీలు

రొళ్ల, జనవరి 21:
మండలంలో త్రీఫేస్ కరెంట్ ఎప్పుడు ఇస్తారో ఎప్పుడు తీస్తారో అర్థం కావడంలేదు. దీంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. పంటలకు ఆరు తడులు పెట్టు కొనేందుకు రైతులు మోటార్ల వద్దే రాత్రిపూట కాపలా ఉంటున్నారు. మండల పరిధిలోని దొమ్మరహట్టి సమీపంలో శివబాల యోగినగర్‌కు చెందిన శ్యామ్‌రాజ్ అనే రైతు రాగిపైరు నాటేందుకు కరెంటు కోసం వేచి చూశాడు. ఎంత సేపటికి పగటి పూట త్రీఫేస్ కరెంటు రాలేదు. దీంతో ఆ రైతు శనివారం రాత్రి కూలీలను తీసుకొనివచ్చి తన పొలంలో రాగి పైరు నాటాడు. ఇదిలా ఉంటే తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అంటూ గొప్పలు చెప్పే ప్రభుత్వం వేళాపాళలేని కోతలతో విద్యుత్ అందిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంటలు పండించేందుకు నానా తంటాలు తప్పడం లేదంటున్నారు. జనవరిలోనే ఇలాఅయితే ఇక వేసవిలో ఎలా అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ వేళల్లో సరిగ్గా విద్యుత్ అందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

సంఘ సంస్కర్త వేమన

పురంలో ఘనంగా చిత్రపటం ఊరేగింపు


వేమన చిత్రపటాన్ని ఊరేగిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

హిందూపురం, జనవరి 21 : ప్రజాకవి యోగివేమన సంఘ సంస్కర్త అని రెడ్డి సంఘం నాయకులు పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలోని తెలుగుతల్లి సర్కిల్ నుంచి బెంగళూరు రోడ్డులో ఉన్న వేమన విగ్రహం వరకు ఆదివారం రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రబోధానందస్వామి శిష్యబృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డికులస్థులు మాట్లాడుతూ... తెలుగువారి చరిత్ర, సంస్కృతి సాహిత్యాల్లో విశిష్టమైన స్థానం కలిగిన మహనీయుడు వేమన అన్నారు. ఆయన ఏ కులం, ఏమమతం అనేదానికంటే ప్రస్తుత సమాజానికి ఉపయోగపడే పద్యాలను అందించారన్నారు. చిరు ప్రాయంలోనే వేమన గురువుల వద్ద సంస్కృతం, గణితం నేర్చుకున్నాడు. కాలక్రమేణ ఆయన ప్రజాకవిగా మారి ఈ సమాజానికి ఉపయోగపడే పద్యాలను ఎన్నో అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌రెడ్డి, బలరాంరెడ్డి, మధుమతిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వేణురెడ్డి, జనార్దన్‌రెడ్డి, పరమేశ్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, అశోక్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ప్రబోధానందస్వామి ట్రస్ట్ హిందూపురం కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఆదినారాయణ, రెడ్డికులస్థులు పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు హర్షణీయం

మాజీ ఎమ్మెల్సీ గుండుమల, మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిరటౌన్, జనవరి 21: ఈరేగౌడ్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు అందించేందుకు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయం అని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఈరేగౌడ్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వారు పాల్గొని వారు మాట్లాడుతూ.. ఈరేగౌడ్ జ్ఞాపకార్థం చారిటబుల్ ట్రస్టును ఏర్పాటుచేసి విద్య, వైద్యంతోపాటు పలు రకాల సేవలు అందించేందుకు వారి కుటుంబం ముందుకురావడం అభినందించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో రొళ్ల జడ్పీటీసీ సభ్యులు అనంతరాజు, టీడీపీ రాష్ట్ర వక్కలిగ సాధికారత కన్వీనర్ వీఎం పాండురంగప్ప, జిల్లా ఏడీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి, ఈరేగౌడ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు హనుమంతేగౌడ్, మంజునాథ్ తోపాటు కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ట్రస్టు ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొని ఈరేగౌడ్ కుటుంబ సభ్యులను అభినందించారు. ఈరేగౌడ్ చేసిన సేవలను గుర్తు చేసుకొన్నారు.

నేడు తుది ఓటరు జాబితా

పుట్టపర్తి, జనవరి 21: సార్వత్రిక ఎన్నికల వేళ నూతన ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. సోమవారం తుది జాబితా వెలువడనుంది. ఇందుకోసం ఆరు నెలలుగా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో అధికారులు విడతల వారీగా సర్వేలు నిర్వహించారు. ఈనెల 12న నమూనా జాబితా విడుదల చేశారు. ఇందులో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో కలిపి 1561 పోలింగ్ కేంద్రాల పరిధిలో 13,91,628 మంది ఓటర్లున్నారు. పురుషులు 6,94,446 మంది, మహిళలు 6,97,119 మంది, ఇతరులు 63 మంది ఉన్నారు. అత్యధికంగా కదిరి నియోజకవర్గంలో 2,50,776 మంది ఓటర్లు ఉండగా.. అతి తక్కువగా పుట్టపర్తి నియోజకవర్గంలో 2,10,076 మంది ఓటర్లున్నారు. వీరుగాక మరికొంతమంది నూతన ఓటర్లు తుది జాబితాలో చేరనున్నారు.

ఫిర్యాదులు పరిష్కారమయ్యేనా?

బోగస్ ఓట్లు ఉన్నాయని, ప్రతిపక్ష నాయకులు పలుమార్లు ఫిర్యాదు చేసింది విదితమే. అధికార పార్టీ నాయకులు బోగస్ ఓటర్లను చేర్చారంటూ ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్నికల అధికారులు సమగ్ర విచారణ చేసి, ఓటరు జాబితాను తప్పులు లేకుండా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఫారం-4 ద్వారా చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగిస్తారు. ఫారం- 8 ద్వారా ఓటరు చేర్పులు, మార్పులు చేస్తారు. వీటిని బీఎల్వోలు సక్రమంగా నిర్వహించలేదన్న ఫిర్యాదులున్నాయి. ఏమాత్రం పూర్తి స్థాయిలో ఓటరు జాబితా వెలువడతుందో తెలియనుంది.

పెరగనున్న నూతన ఓటర్లు..

నూతన ఓటర్ల నమోదుతో ఓటర్ల సంఖ్య పెరగనున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు నూతనంగా లక్షమంది ఓటర్లుపెరిగే అవకాశాలున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 80శాతం ఓటర్లు 18ఏళ్ల నిండిన యువతి,యువకులే ఉండే అవకాశముంది. వారందరూ రానున్న ఎన్నికల్లో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

కొత్తచట్టాన్ని ఉపసంహరించుకోవాలి

లారీ డ్రైవర్ల డిమాండ్.. పట్టణంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న లారీడ్రైవర్లు

హిందూపురం, జనవరి 21: లారీ డ్రైవర్లకు సంబంధించి తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని ఉపసంహరించుకోవాలని హిందూపురంలో లారీ డ్రైవర్లు, గూడ్స్ వాహనాల డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఆలిండియా ట్రక్కర్స్ డ్రైవర్స్ హెల్ప్‌లైన్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో లారీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం డ్రైవర్ల మెడపై కత్తి పెట్టడమేనన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే లారీ డ్రైవర్‌ను శిక్షించడం, రూ.7లక్షల జరిమానా, 10ఏళ్లపాటు జైలు శిక్ష విధించేలా చట్టం తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ చట్టాన్ని సవరించకపోతే లారీలు, ట్రక్కులు నడపడానికి డ్రైవర్లు ఎవరూ ముందుకు రారన్నారు. దీనివల్ల రవాణా వ్యవస్థ స్తంభించిపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం లారీ డ్రైవర్ల విషయంపై పునరాలోచించాలన్నారు. లారీ డ్రైవర్ దేశం మొత్తం తిరగాల్సిన అవసరం ఉంటుందన్నారు. అలాంటి వారికి అండగా నిలవాల్సిందిపోయి కొత్త చట్టం తీసుకొచ్చి భయభ్రాంతులకు గురిచేస్తే ఇక లారీలు నడిపేది ఎవరన్నారు. దీనివల్ల తమ కుటుంబాలు మనోధైర్యాన్ని కోల్పోతాయని అలాంటప్పుడు డ్రైవర్ ఫీల్డ్‌కు వచ్చేవారుండరన్నారు. హిందూపురంలో దాదాపు ఐదు వేల కుటుంబాలు డ్రైవింగ్‌పై ఆధారపడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ట్రక్కర్స్ డ్రైవర్స్ హెల్ప్‌లైన్ జిల్లా కన్వీనర్ శివశంకర్, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రాముడి పూజకు ఆలయాల ముస్తాబు



ముస్తాబైన పావగడ శనిమహాత్మ దేవాలయం


పూజకు సిద్ధంగా ఉన్న సీతారాముల విగ్రహాలు

పావగడ, జనవరి 21: రామజన్మభూమి అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా తాలూకా వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లోనూ సీతారాముల విగ్రహాలకు పూజలు చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. దీంతో తాలూకా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. అలాగే పావగడ పట్టణంలోని శనేశ్వర, కోటె ఆంజనేయస్వామి, పళవళ్లి ఆంజనేయస్వామి, పెద్దపల్లి వరద ఆంజనేయస్వామి, గుండ్లపల్లి బైలాంజనేయ ఆలయాల్లో ఉత్సవవిగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు తెలియపర్చారు.

నేడు మద్యం, మాసం నిషేధం : అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని మద్యం, మాంసపు దుకాణాలను పూర్తిగా మూసివేయాలని స్వచ్ఛంద సేవా సంస్థల నాయకులు పిలుపునిచ్చారు. అలాగే దుకాణదారులందరూ సోమవారం ఒకరోజు వ్యక్తిగతంగా వ్యాపారాలను నిలిపివేసి పూజల్లో పాల్గొనేందుకు మద్దతు తెలపాలని సంఘ సంస్థల నాయకులు కొందరు పిలుపు నిచ్చారు.

పులమతి ఆలయంలో నూతన ఉత్సవ విగ్రహాలు


ఆలయంలో ఉంచిన నూతన ఉత్సవ విగ్రహాలు

హిందూపురం, జనవరి 21 : అయోధ్య రామాలయం లో సోమవారం బాల రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా స్థానిక పులమతి వీరాంజనేయస్వామి ఆలయానికి భక్తులు రూ.1.50 లక్షలతో సీతారామ లక్ష్మణ ఆంజనేయ నూతన ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. గ్రామస్థులు విరాళాలు సేకరించి వాటిని తీసుకొచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో సోమవారం ప్రతి ఇంటా శ్రీరాముడి చిత్రపటానికి పూజలు చేస్తామన్నారు. అలాగే ఆలయంలో నూతన ఉత్సవ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని శ్రీరాముడు, ఆంజనేయస్వామి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు మండలంలో భక్తులు తెలిపారు. ప్రతి హిందువూ భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొనాలని హిందూ ధార్మిక సంఘాలు పేర్కొన్నాయి.

పశ్చాపార్శ్వనాథ ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెనుకొండ, జనవరి 21 : దేశంలోని నాలుగు జైన పీఠాలలో ఒకటైన పెనుకొండలోని పశ్చాపార్శ్వనాథస్వామి దేవాలయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన వార్షికోత్సవ పూజలకు ఘనగిరి శ్రీక్షేత్ర మఠానికి చెందిన భువనకీర్తి భట్టారకాచార్య, ఎన్ఆర్‌పుర శ్రీక్షేత్ర సింహనగద్దె లక్ష్మీసేన భట్టారకాచార్య, ఆలయ కమిటీ సభ్యుడు పార్శ్వనాథయ్య, అర్చకులు దినచంద్రయ్య, నాగరాజయ్య, దూరదర్శన్ డైరెక్టర్ భారతి, చంద్రకీర్తి, సత్యేంద్రకుమార్ జైన్, శ్రేయాష్‌జైన్ హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 108కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు భువనకీర్తిలక్ష్మీసేన భట్టారక ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. అనంతరం ముఖ్య అతిథులను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు అజితప్రసాద్‌జైన్, దేశ విదేశాల నుంచి ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు తదితర దేశాల నుంచి జైన మతస్థులు పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన మఠాధిపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతించారు.

ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన

పెనుకొండ, జనవరి 21 : స్థానిక షాదీమహల్‌లో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనశాలను ఆదివారం బాబయ్య దర్గా కాబోయే వంశ పారంపర్య పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా, ఈశ్వరీయ బ్రహ్మకుమారి హేమలత చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఖమ్రుద్దిన్ గ్లోబల్ ట్రస్ట్ ఛైర్మన్ కలీముల్లా, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, అల్‌కౌసర్ సేవా సంస్థ అధ్యక్షుడు అహ్మది, లాయర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మడకశిర రూరల్, జనవరి 21 : మండలంలోని వైబీ హళ్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ పాఠశాలలో 2004-2005లో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ పాల్గొన్నారు. వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి, సన్మానించారు. రోజంతా ఎంతో సంతోషంగా గడిపారు.